క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దమండ్యం: గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, మదనపల్లె డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. మండలంలోని సీ గొల్లపల్లె గ్రామ సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించాలన్నారు. పక్కాగృహాల నిర్మాణంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, కార్యాలయం ఏఓ వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ జనార్ధన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కలికిరి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని మదనపల్లి డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. మండలంలోని మేడికుర్తి గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, నిర్వహణపై సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆజాద్, కార్యదర్శి రమేష్‌బాబు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

కలకడ : మృతిచెందిన వలంటీర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కొత్తగాండ్లపల్లెకు చెందిన వలంటీర్ శివప్రసాద్ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎంపీపీ, ఎంపీడీఓ గురువారం వారి ఇంటికి వెళ్లి మృతుని భార్య అశ్వితకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా రూ.10,000 నగదును అందజేశారు.

మైనార్టీల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

వాల్మీకిపురం: మైనార్టీల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి సహకారంతో స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీలో నూతనంగా మసీదును నిర్మించేందుకు రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పత్రాన్ని గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మైనార్టీ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద రెడ్డి, కువైట్ ఇబ్రహీం, రాయుడు, సాధిక్, షాహెద్, బబ్లు, సయ్యద్‌బాష, అన్వర్, గౌస్, బాబు, అలీమ్ మహ్మద్ అలి, అర్షద్, సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

మందుల పంపిణీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మర కుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా సమితి సభ్యులు గురువారం బీపీ,షుగర్ ఉన్న పలువురికి ఉచితంగా మందుల కిట్లను అందజేశారు. మందులు అవసరమైన వారు సంస్థ సభ్యులను సంప్రదిస్తే వాటిని సమకూర్చుతామని నిర్వాహకుడు రాజశేఖర్ తెలిపారు.

నేడు గడప, గడపకూ మన ప్రభుత్వం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మడుమూరు పంచాయతీలో శుక్రవారం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది హాజరు కావాలని కోరారు.

పంచాయతీ స్థలాల సర్వే

గుర్రంకొండ: గుర్రంకొండ మేజర్ పంచాయతీ బస్టాండులోని పంచాయతీ స్థలాలు, వాటిల్లో నిర్వహించుకొంటున్న దుకాణాలను అధికారులు సర్వే నిర్వహించారు. గురువారం పంచాయతీ ఈవో బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలోని అధికారుల బృందం బస్టాండులో సర్వే నిర్వహించారు. పంచాయతీ స్థలాలు ఎంత మేరకు ఉన్నాయో మొదట సర్వే చేశారు. సదరు స్థలాల్లో ఎవరెవరు ఎంత మేరకు విస్తీర్ణంలో దుకాణాలు నిర్వహించుకొంటున్నారో ఆరా తీసి వివరాలు సేకరించారు. బినామీ పేర్లతో స్థలాలు ఆక్రమించుకొన్న వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిస్సార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

కురబలకోట: పశువులు రైతుల నేస్తాలని వాటి ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి మండల పశువైద్యాధికారి సౌజన్య అన్నారు. చింతయ్యగారికోటలో పశు విజ్ఞాన బడి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పశు సంపద ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. లాభసాటి పంటలతో పాటు పాడి పశువుల ద్వారా ఆదాయం పెంచుకోవాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ ఎస్‌జి.ధరణి నాథ్‌రెడ్డి, గోపాల మిత్ర సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష

కురబలకోట: మండలంలోని అంగళ్లు గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు కలసి గురువారం అయ్యప్ప స్వామి మాలధారులకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. మత సామరస్యాన్ని చాటారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముద్ర దామోదర్ రెడ్డి, జాకీర్, మహబూబ్‌పీరా, ఇస్మాయిల్, బావాజీ, ఆరీఫుల్లా, మణికంఠ, పవన్‌కుమార్, సయ్యద్ అహ్మద్, రిజ్వాన్, అమానుల్లా పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పట్టణంలోని 27వ వార్డు జ్యుడిషియల్ కాలనీ, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. స్థానిక కౌన్సిలర్ షేక్ కరీముల్లా, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి బుక్‌లెట్స్‌ను అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తూ సంక్షేమ పథకాల ద్వారా సుస్థిర ప్రగతి సాధించేలా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పథకాన్ని నేరుగా పేదల ఇంటి ముంగిటకే అందించేలా సీఎం జగనన్న చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజల్లో జగనన్నకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు తన సభలకు భారీగా ప్రజలను తరలిస్తున్నారన్నారు. ప్రచారం చేసుకోవడానికి ఇరుకుసందుల్లో మీటింగ్‌లను పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఇటీవల కందుకూరు, గుంటూరుల్లో డ్రోన్ షూట్‌లు, ఫోటోల కోసం ప్రచారపిచ్చితో చేసిన తప్పిదంతో 11మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. దీనికి బాధ్యత చంద్రబాబుదేనన్నారు. చంద్రబాబు మీటింగ్‌లో టీడీపీ కార్యకర్తలు చనిపోతే మానవతా దృక్పథంతో తక్షణమే స్పందించి మృతుల కుటుంబాలకు ఆర్థికసహాయం ప్రకటించిన మంచి మనస్సు సీఎం జగనన్నదని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామిశెట్టిశివయ్య, ఈశ్వర్‌నాయక్, వసీం, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు మెట్రోబాబ్‌జాన్, సదాశివరెడ్డి, మంజుల, రహీం, జాన్‌బాబు, రెడ్డిశేఖర్, కోఆప్షన్ శారద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పీలేరు రూరల్ : మామిడి రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ పెద్దిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు కంభం వాసుదేవరెడ్డి మామిడి తోటను పరిశీలించారు. మామిడి పూత దశలో ఉన్నందున తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూత దశలో మామిడిలో తేనె మంచు పురుగు ఆశిస్తుందని తెలిపారు. తేనేమంచు పురుగు నివారణకు తోటలో కలుపులేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. తేనె మంచు పురుగు నివారణకు మొదటి పిచికారిలో ఇమిడాక్లోప్రిడ్ 0.04 ఎంఎల్ గానీ, సైహాలోథిన్ 5 ఈసీ 1 ఎంఎల్ గానీ 5 మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి కొనసాగితే 20 రోజుల తరువాత థయోమిథాక్సిమ్ 25 డబ్ల్యూజీ 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఇంకా నష్టం కొనసాగుతుంటే బుప్రోఫెజిన్ 25 ఎస్‌సీ 1.2 మిల్లీలీటరు ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి. సకాలంలో పూత బాగా రావడం వల్ల మంచి దిగుబడి ఉంటుందని తెలిపారు.

చట్టానికి అందరూ సమానులే

కలికిరి: చట్టానికి అందరూ సమానులేనని, ఇది మరచిన మాజీ సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనలో పోలీసుల పట్ల ప్రవర్తించిన తీరు అమానుషంగా ఉందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. గురువారం కలికిరి పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్లు, కూడళ్లలో రోడ్ షోలు, సమావేశాలతో సామాన్యులకు ఇబ్బందులు తలెత్తుతాయని చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పటికే అలాంటి సమావేశాలు ఏర్పాటు చేసి 11 మంది అమాయకుల ప్రాణాలు బలిగొన్నది చాల లేదా అన్నారు. ప్రభుత్వ జీఓను స్వాగతించాల్సింది పోయి నానా యాగీ చేయడం చంద్రబాబుకు తగదన్నారు.

పౌష్టికాహారం కోసం మనకోడి పథకం



కాప్పల్లెలో మనకోడి పథకం యూనిట్‌లు అందజేస్తున్న ఏపీఎం సుబ్రమణ్యం

రామసముద్రం: ప్రజలు పౌష్టికాహారం పెంచుకునేందుకు మనకోడి పథకం ప్రవేశపెట్టినట్లు వెలుగు ఏపీఎం సుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న మనకోడి పథకం కింద మండలంలోని 41 వివోలలో 38 మనకోడి పథకం యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకోడి పథకం కింద ఒకొక్కరికి రూ.3200 నగదు చెల్లిస్తే 8 పెట్టకోళ్లు, మూడు కోడిపుంజులు 750 గ్రాముల నుంచి 950 గ్రాముల వరకు ఉంటాయన్నారు. ప్రజలు బయట కలుషితమైన మాంసం తినకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం మనకోడి పథకాన్ని ప్రవేశపెట్టి నేరుగా ప్రజలే కోళ్లను ఇంటి వద్ద పెంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకునేలా చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య లీడర్లు , సర్పంచ్‌లు , ఎంపీటీసీలు, సీసీలు , వివో లీడర్లు, సంఘమిత్రాలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక సింగిల్ విండో కార్యాలయం వద్ద ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన అనంతరం పెన్షన్‌దారులకు ముఖ్యమంత్రి పంపిన సందేశపత్రాన్ని అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మండలంలో 5,054 పింఛన్లు ఉండగా ప్రభుత్వం ప్రతినెలా రూ.1,41,75,250 పంపిణీ చేస్తోందన్నారు. నూతనంగా మరో 136 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక మంజూరైందన్నారు. రానున్న రోజుల్లో నిమ్మనపల్లె మండలంలో మదనపల్లె–నిమ్మనపల్లె డబుల్‌రోడ్, లింక్‌రోడ్ల నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణా రెడ్డి, సదాశివరెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ సీఆర్.మంజుల, ఎంపీడీఓ లీలామాధవి, సర్పంచులు ఉషారాణి, మహదేవరెడ్డి, చెంగ్రాయుడు, సుబ్రహ్మణ్యం, నాయకులు నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ పెన్షన్ కానుక చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

వాల్మీకిపురం: మండలంలోని జర్రావారిపల్లి సర్పంచ్ మునిభాస్కర్ గురువారం పంచాయతీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్ల ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతమ్మ, నాయకులు గురుమూర్తి, రామారావు, రాజ, చంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కలకడ : అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నారని ఎనుగొండపాళ్యం సర్పంచ్ మంజుల, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు అన్నారు. గురువారం స్థానిక సచివాలయంలో నూతన పింఛన్లు మంజూరైనవారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

కలికిరి: కుల మత రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కిందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మండలంలోని పత్తేగడ పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యదర్శి హిమబిందు పాల్గొన్నారు.

కేవీపల్లె : ఎంపీపల్లె సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి గురువారం మండలంలోని ఎంపీపల్లె గ్రామ సచివాలయంలో పింఛన్లు పెంపు వారోత్సవాలు నిర్వహించారు. కొత్తగా మంజూరైన 15 మందికి పింఛన్లు అందజేశారు. ఎంపీటీసీ ఈశ్వరయ్య, నాయకులు రెడ్డెప్పరెడ్డి, వేణు, శివ తదితరులు పాల్గొన్నారు. గోరంట్లపల్లె పంచాయతీలో మండల ప్రత్యేక ఆహ్వానితులు పి. ద్వారకనాథరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ పెద్ద సిద్దయ్య, మాజీ సర్పంచ్ కె. రమణారెడ్డి, మాజీ ఎంపీపీ నాగేశ్వర, నాయకులు సహదేవరెడ్డి, గుణరెడ్డి, కొండారెడ్డి, యర్రమరెడ్డి, ఈశ్వర కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

నెరవేరిన చిరకాల కల

– 80 ఏళ్ల తర్వాత ఊరికి రోడ్డు

– దళితవాడలో పండగ వాతావరణం

కురబలకోట: కురబలకోట మండలం బుడతన రాళ్ల హరిజన వాడకు గురువారం రోడ్డు సౌకర్యం కల్పించారు. ఊరు ఏర్పాటైనప్పటి నుండి ఈ ఊరికి రోడ్డు లేదు. కాలిబాటలో రైతుల దయాదాక్షిణ్యాలతో రాకపోకలు సాగిస్తూ వచ్చారు. గతంలో ఎన్నో ప్రయత్నాలు సాగినా ఫలించలేదు. 80 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఈ ఊరికి రోడ్డు సౌకర్యం ఏర్పడింది. సామరస్య పరిష్కారంతో ఇది సాధ్యమైంది. ఇన్నేళ్లుగా ఓ రైతు అభ్యంతరం చెబుతూ వచ్చారు. పలు సమావేశాల్లో ఈ రోడ్డు సమస్య గురించి చర్చకు వచ్చేది. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కూడా రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు.

రోడ్డు వేయాలని ఆయన కూడా ఆదేశించారు. దీంతో ఎంపీపీ బి. దస్తగిరి, తహశీల్దారు ఎం. భీమేశ్వర రావు గురువారం గ్రామస్తులతో చర్చించారు. అభ్యంతరం చెబుతూ వచ్చిన రైతుతో మాట్లాడారు. రికార్డు ప్రకారం విలేజ్ ప్లాన్‌లో కడప రోడ్డు హైవే నుండి ఊరి వరకు రోడ్డు ఉందని దీనితో రోడ్డు వేయకతప్పడం లేదని నచ్చచెప్పారు. ఒక కిలోమీటరు పొడవున రోడ్డుకు కొలతలు గుర్తించి జేసీబీతో రోడ్డు పనులు ప్రారంభించారు. చిరకాల కల నెరవేరడంతో గ్రామస్తులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామవాసులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సుభాషిణి, శ్రీనివాసులు, సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుడతనరాళ్ల హరిజనవాడకు రోడ్డు నిర్మాణానికి మార్కు చేస్తున్న అధికారులు

ఆధార్‌కు ఓటరు కార్డు అనుసంధానం చేయాలి

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

మదనపల్లె : ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఆధార్‌కు ఓటరుకార్డు అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. గురువారం సాయంత్రం సబ్ కలెక్టరేట్‌లో పట్టణంలోని బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఆర్డీఓ మురళీ మాట్లాడుతూ.. పట్టణంలో ఇప్పటివరకు ఆధార్‌కు ఓటరుకార్డు అనుసంధానం అతితక్కువగా 68శాతం మాత్రమే చేశారన్నారు. దీనికి సంబంధించి బీఎల్వోలు జనవరి 15లోపు 100శాతం పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే ఓటరు నుంచి తీసుకున్న ఫారం–6బి పోలింగ్‌స్టేషన్ల వారీగా జాగ్రత్తపరచాలన్నారు. ఓటరు అందుబాటులో లేని పక్షంలో వారి కుటుంబ సభ్యుల నుంచి ఫారం–6బి, లేదా ఆధార్, ఓటరు కార్డు అందజేస్తే అనుసంధానం చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

ఆధార్ లేని పక్షంలో ఎన్నికల కమిషన్ సూచించిన ఇతర గుర్తింపుకార్డును జతచేయాలన్నారు. ఆధార్‌తో ఓటరుకార్డును అనుసంధానం చేయడం వల్ల గోప్యత ఉండటంతో పాటు నకిలీ ఓట్లను నివారించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో లేదా బీఎల్‌ఓల సహకారంతోనూ ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, బీఎల్వోలు పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం వినాయక్ నగర్‌లో మురికినీటి కాలువ ఏర్పాటు చేయాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి ప్రజలు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.20 లక్షలతో మురికినీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ పనులను గురువారం ఎంపీడీఓ అశ్వని, సర్పంచ్ రహమత్‌బీ పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండాలని సూచించారు.



మురికినీటి కాలువ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అశ్వని

సీఎం జగన్‌తోనే జనరంజక పాలన

– విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 3వ సచివాలయం పరిధి సూర్యానగర్, వినాయకనగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన జీవితం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనులు నిర్వహిస్తోందన్నారు. గత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడలేదని తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుతీరు చూసి ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటికే ఈ నిధులతో కొన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, శివయ్య, సిహెచ్.రమేష్, మండల నాగేంద్ర, ఎంపీడీవో నాగార్జున, ఎంపీటీసీ షబానా, ఏవో సుధాకర్, వైఎస్ కరీముల్లా, రౌఫ్, మండల ప్రవీణ్, దమ్ము రఘు, శ్రీరామ్ వినోద్, మల్లు క్రిష్టారెడ్డి, పుష్పలత, నాగమణి, అరుణ, దాడిశెట్టి సిద్దు, జనార్ధన్‌రాజు, బండారు మల్లి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. వాల్మీకిపురం మండలంకు చెందిన ఇద్దరికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.2,40,000 ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, చిన్న, సాగుబడి ఆనంద రెడ్డి, రఘు, రవీంద్ర రెడ్డి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం రామానాయక్ తాండా పరిసర ప్రాంతంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక గురువారం తెలిపారు. రామానాయక్ తాండా సమీపంలో నాటు సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది దాడులు నిర్వహించి సుమారుగా 500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

పీలేరు రూరల్ : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సదరం స్లాట్ బుకింగ్ శుక్రవారం నుంచి అందుబాటులో ఉంటుందని ఎంపీపీ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లు పొందేందుకు బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అర్హులకు శాశ్వత ధృవీకరణ పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు వైద్యశిబిరం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో మహిళల సౌకర్యార్థం శనివారం పింక్ బస్సు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ గజ్జెల శృతి తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్‌బస్సు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 40 సంవత్సరాలు వయస్సు నిండిన మహిళలకు ఉచితంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న కమిటీల ఎంపిక

మదనపల్లె : కురుబ, కురుమ, కురవ సంఘం ఆధ్వర్యంలో మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి నిమ్మనపల్లె, మదనపల్లె, రామసముద్రం మండల కమిటీల ఎంపిక ఈనెల 8వ తేదీన జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎగువ కురవంకలోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం జరిగే కార్యక్రమానికి నియోజకవర్గంలోని కురబ కులస్తులు అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు.

సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండాలి

రామసముద్రం: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని వైస్‌ఎంపీపీ గంగాధర్ నాయుడు తెలిపారు. గురువారం ఆయన కమ్మవారిపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరుపట్టిని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి రోజు సచివాలయానికి హాజరుకావాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరేలా కృషి చేయాలన్నారు. కొత్తగా మంజూరైన పెన్షన్‌దారులకు నేరుగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వాణి, లక్ష్మిరెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల పట్ల మర్యాద పాటించాలి

మదనపల్లె సిటీ: ప్రయాణికుల పట్ల మర్యాద పాటించాలని స్థానిక ఆర్టీసీ 1వ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బస్సులను స్టేజీల వద్ద ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈపీకె, కెఎంపిఎల్ పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, ఏఎంఎఫ్ మురళి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలి

పీలేరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ ఉద్యోగులు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం స్థానిక 4, 5వ గ్రామ సచివాలయాలకు సంబంధించి బోదేషావలి దర్గాలో మండల స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తెలిపారు. పట్టణంలో దెబ్బతిన్న ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, వైస్ ఎంపీపీలు చలపతి, హరిత, ఎంపీటీసీలు జోహార్, ఇబ్రహీమ్, నాయకులు హుమయూన్, శ్రీనాథరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, రమణ, జయపాల్ రెడ్డి, పెద్దోడు తదితరులు పాల్గొన్నారు.